పల్లెకు జ్వరమొచ్చింది..!

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- జ్వరాలతో ఆసుపత్రిబాట పడుతున్న ప్రజలు
- విజృంభిస్తున్న డయేరియా, టైఫాయిడ్
- వాతావరణ మార్పులే కారణమంటున్న వైద్యాధికారులు

తనకల్లు: పల్లెల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో ఏ ఇంట్లో చూసినా మలేరియా, టైఫాయిడ్, డయేరియా, విష జ్వరాల మూలుగులే వినిపిస్తున్నాయి. నెల రోజులుగా తనకల్లు 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, కొక్కంటిలోని ప్రాథమికారోగ్య కేంద్రంలో డయేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్స్‌తో వచ్చే వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతోంది. రోజూ ఆసుపత్రిలో జ్వరాల బారిన పడిన రోగులు చికిత్స కోసం ఓపీలో వందల సంఖ్యలో బారులు తీరుతున్నారు. వాతావరణ మార్పులతో పాటు పల్లెల్లో పారిశుధ్యం పడకేయడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి.

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. అక్కడక్కడా తాగునీటి కుళాయిలు, పైప్‌లైన్ లీకేజీలు ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. మండల కేంద్రంతో పాటు మిగిలిన గ్రామాల్లోనూ ఇలాంటి పరిస్థితే నెలకొన్నట్లు ప్రజలంటున్నారు. చాలా గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో రోడ్లపై మురుగునీరు పారుతోంది. ఉన్నచోట్ల పూడిక తొలగించడం లేదు. దీంతో వాటి ద్వారా తీవ్ర దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు విపరీతంగా వృద్ధి చెంది అనేక రోగాల బారిన పడుతున్నామని వారు వాపోతున్నారు.



తనకల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితురాలు



తనకల్లులోని గ్రామ సచివాలయం సమీపంలోని వీధిలో పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారం



హరిజన వాడలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

విజృంభిస్తున్న వ్యాధులు

గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండడం, దోమల వ్యాప్తి అధికంగా ఉండడంతో రోగాలు విజృంభిస్తున్నాయి. తనకల్లు ప్రభుత్వాసుపత్రిలో రోజూ సగటున 20 మంది డయేరియా, ఆరుగురు టైఫాయిడ్, 30 మంది వరకు జ్వర బాధితులు నమోదవుతున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇవి అధికారికంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకు వచ్చిన రోగుల వివరాలైతే ... అనధికారికంగా ప్రైవేట్ ఆసుపత్రులు, బయట నగరాలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నవారు వందల సంఖ్యలోనే ఉంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు రోగల బారినపడి బాధపడుతున్నారు.

జలుబు జ్వరంతో బాధపడుతున్నా



నేను నాలుగు రోజులుగా జలుబు, ఒంటి నొప్పులు, జ్వరంతో బాధడుతున్నాను. రోజు గవర్నమెంట్ ఆసుపత్రికి వచ్చి డాక్టర్‌కి చూపించుకొని వెళ్లుతున్నాను. అయినా జలబు, జ్వరం తగ్గడం లేదు.

–తులసమ్మ, కొక్కంటిక్రాస్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎవరికైనా జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. పీహెచ్‌సీ వైద్యాధికారులు జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

– విజయ్‌బాబు, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, తనకల్లు

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం



పారిశుధ్యం, దోమల నివారణకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం, పైప్‌లైన్ లీకేజీలను అరికట్టడం, డ్రైనేజీల్లో పూడికలు తీయించడం, దోమల నివారణ కోసం పారిశుద్ధ్య చర్యలు చేట్టాలని కార్యదర్శులను ఆదేశించాం. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి.

– కృష్ణమూర్తిరెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ, తనకల్లు

క్లుప్తంగా

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సీడీపీఓ నాగలక్ష్మీ

తాడిమర్రి: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, బాలికలు ఉన్నత చదువులు చదవాలని సీడీపీఓ నాగలక్ష్మీ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో శనివారం ఆమె కిశోర బాలికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదివాలన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నెలసరిలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాడ్, గుడ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓట్‌రీచ్ వర్కర్ లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్ లలితమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, విజయలక్ష్మీ, హరిత తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

కదిరి టౌన్: న్యాయవాది రామస్వామినాయుడుపై దాడి చేసిన బీజేపీ నాయకుడు తలుపుల గంగాధర్ అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఘటనపై న్యాయవాదులు చేపట్టిన నిరాహార దీక్ష శనివారం ఐదో రోజుకు చేరింది. దీక్షకు పీసీసీ అధికార ప్రతినిధి ఇందాదుల్లాఖాన్ మద్దతు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



వ్రతం చేస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్ లోనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం శనివారం సందర్భంగా మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను అర్చకులు రాజేష్ వివిధ పూలు, తులసి ఆకులు, పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: స్థానిక గణేశ హరిహర ఆలయంలో శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు వ్రతాన్ని ఆచరించారు. సాయంత్రం భజన కార్యక్రమాలు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో వైకేపీ సీసీకి గాయాలు



గాయపడిన వైకేపీ సీసీ ఆనంద్ కుమార్

చెన్నేకొత్తపల్లి: స్థానిక వైకేపీ కార్యాలయంలో విధులు నిర్వరిస్తున్న సీసీ ఆనంద్ కుమార్ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఆనంద్ కుమార్ విధులకు హాజరయ్యేందుకు అనంతపురము నుంచి చెన్నేకొత్తపల్లికి ఆర్టీసీ బస్సులో బయలు దేరారు. చెన్నేకొత్తపల్లి 44వ నంబర్ జాతీయ రహదారిపై వై జంక్షన్ దాటగానే బస్సు దిగేందుకు డోర్ వద్దకు వచ్చారు. అయితే అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమైయింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, స్థానికులు సీసీ ఆనంద్ కుమార్‌ను వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో అనంతపురము తరలించారు. విషయం తెలుకున్న ధర్మవరం ఏరియా కో–ఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి, ఏపీఎం అనసూయమ్మ, తోటి సీసీలు, ఇతర సిబ్బంది ఆసుపత్రికి చేరుకున్నారు. సీసీ ఆనంద్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి అధికారులు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. మాల్యవంతం సమీపంలోని కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్ద మూడు రోజుల క్రితం మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని ఆర్టీటీ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదేశాల మేరకు పంచాయతీ కార్మికులు, పోలీసులు అనాథ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. వీఆర్‌ఓ మణికుమార్, కానిస్టేబుల్ సుదర్శన్‌నాయుడు, అనిల్‌కుమార్, జనార్థన్, కాశీరెడ్డినాయన ఆశ్రమ నిర్వహకులు సూర్యనారాయణ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గురుపౌర్ణమి వేడుకలు

బత్తలపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంఘమేశ్వరం, బత్తలపల్లి, మాల్యవంతం, రామాపురం శనివారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. బత్తలపల్లి, రామాపురం గ్రామాల్లోని షిర్డీసాయిబాబా ఆలయంలో నగర సంకీర్తన, అన్నదానం, కోలాటం, ఉపన్యాసములు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి నుంచి భజన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మేలుకొలుపు, కాగడా హారతి, ప్రత్యేక అభిషేకం, సత్యవ్రతం, సాయిపూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయనిన్నా ఆలయ అర్చకులు నెప్పల్లి వెంకటాచలపతి తెలిపారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంఘమేశ్వరంలో శనివారం నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ప్రదాన అర్చకులు జయకుమార్, చంద్రస్వామి తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడ సతీసమేతంగా నవగ్రహాలు ఉన్నాయన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

కదిరి టౌన్: పట్టణంలోని వాణివీధిలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నమని ఆలయ చైర్మన్ చెన్నరాయ శెట్టి తెలిపారు. బాబా దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆలయ కోశాధికారి రమణ,సెక్రటరీ వెంకటాచలం, సభ్యులునామా రాము, శేషు, రామ్మోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఉంచి రాత్రి వరకూ పూజ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులకు అన్నదానం చేర్పాటు చేశామని పేర్కొన్నారు.



బత్తలపల్లి మండలం రామాపురంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: సాయినగర్‌లోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు షిరిడిసాయిబాబా పాద దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

నల్లమాడ: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. షిర్డీ సాయిబాబా వివిధ రకాల పూజలు, అభిషేకాలతో పాటు పల్లకీ సేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదం వితరణ ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

రామగిరి: మండలంలోని పేరూరులో మొహర్రం వేడుకల్లో భాగంగా శనివారం భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు నిర్వహించారు. భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య పానకాల కుండలను తలపై పెట్టుకుని పీర్ల మసీదు వద్దకు తీసుకెళ్లారు. పీర్ల మసీదులో చక్కెర చదివింపులు చేయించారు. పీర్లను దర్శించుకునేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. మొక్కుబడి ఉన్న భక్తులు చెట్లను కొట్టి ఎద్దులు, ట్రాక్టర్ ద్వారా గుండంలోకి వేశారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

బత్తలపల్లి: మొహర్రంను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం రాత్రి మండంలోని నెత్తివారంపల్లి, ఓబుళాపురం గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామపెద్దలకు పలు సూచనలు, సలహాలు అందించారు. వేడుకల్లో ఎలాంటి గొడవలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మత్తులో ఇరువర్గాలు గొడవలకు దిగినా సహించమన్నారు. ఏ చిన్న గొడవ జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని, గొడవలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఓబుళాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ఇదిలా ఉండగా పై రెండు గ్రామాల్లో శనివారం పెద్ద సరిగెత్తు వేడుకలను నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

నల్లచెరువు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యసిబ్బంది ప్రజలకు సూచించారు. బాలేపల్లి తండాలో వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గ్రామంలోని 61 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో నీరు నిల్వ ఉన్న చోట దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. డాక్టర్ అలేఖ్య, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్లు సుధాకర్, రెడ్డెమ్మ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామాంజనేయులు, సూపర్ వైజర్ మహబూబ్‌బాషా, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ధర్మవరం అర్బన్: ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు దిల్షాద్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం సీఐటీయూ ధర్మవరం మండల కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు, పెన్షన్ సౌకర్యం కల్పించడంతోపాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్‌గా జేవీ రమణ, కోకన్వీనర్‌గా అయుబ్‌ఖాన్, ఆదినారాయణ, బాబులతోపాటు 19 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ముకుంద, చెన్నకేశవ, వెంకట్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు సరస్వతి, దీనా, పోతక్క, స్కూల్ స్వీపర్స్ జయమ్మ, చౌడమ్మ, ముంతాజ్, హమాలీ నాయకులు కోటి, కదిరప్ప, ఆశా వర్కర్లు ఇర్ఫాన, వీఆర్‌ఏ నాయకులు రామకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఎంపీపీ రాజీనామా ఆమోదం

గాండ్లపెంట: గొడ్డువెలగల ఎంపీటీసీ తాతం జగన్మోహన్ ఎంపీపీ పదవికి ఇచ్చిన రాజీనమాను ఆమోదించినట్లు జిల్లా పరిషత్ సీఈఓ నుంచి శనివారం ఉత్తర్వులు అందాయని ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. జగన్మోహన్ ఎంపీపీ పదవికి ఈ నెల 8న రాజీనామా విషయం తెలిసిందే.



చెన్నేకొత్తపల్లిలో సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతున్న పిల్లలు

'సెల్'కు దాసోహం

ఆనందంగా గడపాల్సిన బాల్యం సెల్‌ఫోన్ మాయలో పడిపోతోంది. తోటి మిత్రులతో గేమ్స్ ఆడుతూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. సెల్‌కు దాసోహం అవుతూ ప్రపంచాన్ని మరచిపోతున్నారు. విశ్వం అరచేతిలో ఇమిడిపోయేంతగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని ఆనందించాలో తెలియడం లేదు. జ్ఞానాన్ని పెంచుకునేందుకు సెల్ వాడుతున్నారా? అంటే లేదనే చెప్పాలి. చాలామంది ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస అవుతున్నారు. భావిభారత పౌరులు తమను తాము మరచి తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. శనివారం చెన్నేకొత్తపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ముగ్గురు పిల్లలు బెంచ్‌పై కూర్చొని మొబైల్‌లో గేమ్ ఆడుతూ కనిపించిన దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – చెన్నేకొత్తపల్లి:

ప్రణాళికలు సిద్ధం చేయండి

పుట్టపర్తి అర్బన్: మండల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయని అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి తనకు ఇస్తే వాటికి కావాల్సిన నిధులను తీసుకొస్తామన్నారు. కోనాపురం, మార్లపల్లి ఎస్సీ కాలనీల్లో తాగునీటి ఎద్దడి ఉందని, బోర్లు వేసినా విద్యుత్ సౌకర్యం కల్పించలేదని ఎంపీపీ తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో వేర్వేరుగా సమీక్షలు జరిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు హనుమంతరెడ్డి, రంగన్న, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి

గాండ్లపెంట: గ్రామాల్లో పారిశుద్యనికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ రామానాయక్ అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణ, మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. వీధుల్లో వర్షపు నీరు లేకుండా చూడాలని తద్వారా దోమల బెడదను నివారించాలని వైద్య సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటి, నీటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. సిబ్బంది సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ సునిత, వైద్యాధికారులు మహేశ్వరమారుతి, బాబాఫకృద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పేపర్ ప్లేట్స్ మిషన్ వితరణ

కదిరి టౌన్: పట్టణంలోని శ్రీఖాద్రీ దివ్యాంగుల సంక్షేమ సంఘానికి వాల్మీకి పాఠశాల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిజ్ఞా ఫౌండేషన్ సహకారంతో దాదాపు రూ.3 లక్షల విలువైన పేపర్ ప్లేట్స్ మిషన్ వితరణ చేశారు. శనివారం యంత్రాన్ని ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దివ్యాంగుల భవనం శిథిలావస్థకు చేరుకుందని, భవనం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

నల్లచెరువు: యర్రగుంటపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. బెంగళూరుకు చెందిన నారాయణ స్వామి, చందన దంపతులు శనివారం కదిరి పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి బైక్‌పై కదిరికి బయలుదేరారు. యర్రగుంటపల్లి వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో చందనకు గాయాలయ్యాయి.అటుగా వెళ్తున్న వందేమాతరం టీమ్ సభ్యులు శేఖర్, అశోక్ గాయపడిన మహిళను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా మక్బూల్ జన్మదిన వేడుకలు



ప్రభుత్వాస్పత్రిలో బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కదిరి టౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్డు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముష్టికోవెలలో పారిశుధ్య పనులు



డ్రైనేజీలో పూడికతీస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ముష్టికోవెల గ్రామంలో శనివారం సర్పంచ్ రామలక్ష్మమ్మ, కార్యదర్శి మురళీమోహన్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో గ్రామంలో పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. డ్రైనేజీలో పేరుకుపోపయిన చెత్తాచెదారం తొలగించడం జరిగిందన్నారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తనకల్లు: రైతులు పంట సాగు చేసే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని జనజాగృతి ఎస్‌ఎఫ్ అగ్రికల్చర్ ప్రతినిధి సుప్రియ అన్నారు. మార్పురివాండ్లపల్లి, నడిమికుంట్లపల్లిలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వాడడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రాయలసీమ వాటర్ ప్రాజెక్టులో భాగంగా అజీజ్ ప్రేమ్‌జీ సహకారంతో బీడు భూములను సాగు భూములుగా తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. బీజామృతం, ద్రవ బీజామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. జేజే సిబ్బంది గరుడప్ప, రమణానాయక్, విశ్వనాథ్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌ఓ తొలగింపుపై ఆర్డీఓ విచారణ

ఎన్‌పీకుంట: కేజీబీవీ ఎస్‌ఓ తొలగింపుపై కదిరి ఆర్డీఓ సన్నీవంశీక్రిష్ణ విచారణ చేపట్టారు. ఈ నెలలిన స్థానిక కేజీబీవీని ఇన్‌చార్జ్ జీసీడీఓ తనిఖీ చేసి పలు ఆరోపణలు ఉన్నాయంటూ ఎస్‌ఓ రిహానాను విధుల నుంచి తొలగించారు. దీనిపై ఎస్‌ఓ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ శనివారం పాఠశాలకు చేరుకొని పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. బోధన, బోధనేతర సిబ్బందితో విడివిడిగా వివరాలు సేకరించారు. నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ నరేంద్ర కుమార్, ఎంఈఓ గోపాల్‌నాయక్, పాఠశాల ఇన్‌ఛార్జ్ ఎస్‌ఓ పావని, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ముదిగుబ్బ: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పంచాయితీ కార్యదర్శి మంజుల అన్నారు. శనివారం మండల కేంద్రంలో క్రాంతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.